నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024 | HYDERABAD

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై రూపుదిద్దుకుంటున్న మహనీయుల చిత్రాలు

వినాయకచవితి పర్వదినం దగ్గరపడుతుండటంతో గణేశ్ విగ్రహాల తయారీలో వేగం పెరిగింది. ఉప్పల్‌లో గణపయ్యలకు రంగులద్దుతున్న కళాకారుడు

రెడ్ సిగ్నల్

యోగ్యమైన మెట్రో మార్గాల విస్మరణ

కోట్లు వెచ్చించి రూపొందించిన అధ్యయనాలు..నివేదికలు బుట్ట దాఖలయ్యాయి..ప్రభుత్వం మారగానే ప్రాజెక్టుల ప్రాధాన్యతలు మారిపోయాయి.. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను రద్దు చేయడమే ఏకైక ఏజెండాతో ముందుకెళ్తున్న కాంగ్రెస్ సర్కారు.. మహానగరానికి సంబంధించిన ప్రజా రవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుల విషయంలో తీసుకున్న నిర్ణయం రవాణా రంగ నిపుణులను విస్మయానికి గురిచేసింది. రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీట వేసిన హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ.. వాస్తవాలను ప్రభుత్వ పెద్దలకు వివరించకుండా మెట్రో రెండో దశలో మార్గాలను ప్రతిపాదించింది. బీహెచ్ఈఎల్ - లక్డీకాపూల్ వయా గచ్చిబౌలి.. రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు వయా ఓఆర్ఆర్ మార్గాలు యోగ్యమైనవని నివేదికలు చెప్పినా.. వాటిని పక్కన పెట్టారు. అంతిమ నిర్ణయాలు తీసుకోవాల్సింది పాలకులే అయినా... తీసుకునే నిర్ణయాలు సరైనవో కాదో సమగ్రంగా, శాస్త్రీయంగా వివరించే బాధ్యత ప్రభుత్వ అధికారులది. ఆ పాత్రను వారు విస్మరించారు. జీ హుజూర్ అంటూ..సర్కారు ఏది చేయమంటే అది చేసేస్తున్నారు.

- సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ)

- కోట్లు వెచ్చించి క్షేత్ర స్థాయిలో అధ్యయనాలు
- మెట్రో రైలు ప్రాజెక్టులో ప్రాధాన్యతలన్నీ బుట్టదాఖలు
- బీహెచ్ఈఎల్ - లక్డీకాపూల్ వయా గచ్చిబౌలి రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు వయా ఓఆర్ఆర్ మార్గాలు యోగ్యమైనవని చెప్పిన నివేదికలు
- పక్కనపెట్టేసిన కాంగ్రెస్ సర్కారు

అత్యంత రద్దీ మార్గాల్లో మెట్రో రైలు అందుబాటులోకి రావడం వల్ల భారీగా ఇంధన పొదుపు, అదే సమయంలో వాహనాల నుంచి వెలువడే వాయు కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. కానీ ఈ విషయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా రేవంత్ సర్కారు ఒక తప్పుడు నిర్ణయం తీసుకున్నది. ట్రాఫిక్ సమస్యల విషయంలో హైదరాబాద్ మహానగరం మరో బెంగళూరు నగరంలా మారకూడదంటే... రాజకీయ ప్రయోజనాల కన్నా... హైదరాబాద్ నగర ప్రజా రవాణా అవసరాలే ప్రధాన ఏజెండాగా ఉండాలి. కానీ ఇక్కడ జరిగింది అందుకు విరుద్ధం. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో కొత్తగా మెట్రో మార్గాలను ప్రతిపాదించి, వాటిని నిర్మించేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తోంది. కానీ అత్యంత ట్రాఫిక్ రద్దీ ఉన్న మార్గాల్లో ఒకటైన బీహెచ్ఈఎల్-గచ్చిబౌలి-టోలిచౌకీ మీదుగా లక్డీకాపూల్ వరకు 26 కి.మీ, అదేవిధంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించాల్సిన మెట్రో మార్గాలను పూర్తిగా పక్కన పెట్టింది. తనకే అంతా తెలుసు అన్నట్లుగా రెండో దశ మెట్రో కింద 5 మార్గాలను ప్రతిపాదించి, అత్యంత కీలకమైన ఆ రెండు మార్గాలను మాత్రం పక్కనపెట్టారు.

అత్యవసరం ఆ రెండు మార్గాలు...

మొదటి దశలోని 69 కి.మీ మెట్రో ప్రాజెక్టులో 3 కారిడార్లు ఉండగా, అందులో రెండు కారిడార్లు (ఎల్బీ నగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం) యోగ్యమైనవిగా నిరూపితమయ్యాయి. మూడో కారిడార్ అయిన జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో మార్గంలో ప్రయాణికులే ఉండటం లేదు. ఇదీ ఆరేండ్లుగా మెట్రో రైళ్లను నడుపున్న ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ చెబుతున్న మాట. మొదటి దశలో అత్యంత యోగ్యమైన రెండు కారిడార్ల మాదిరిగా బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్, రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాలు ఉంటాయని ట్రాఫిక్ అధ్యయన నివేదికలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా.. రోడ్లన్నీ వాహనాలతోనే నిండి ఉంటున్నాయి. అలాంటి మార్గంలో మెట్రో రైలు సదుపాయం వస్తే వాహనాలకు బ్రేక్‌లు పడతాయి. కార్లను మెట్రో స్టేషన్లలోని పార్కింగ్ స్థలాల్లో ఉంచి.. ఎంచక్కా మెట్రో రైలులో ప్రయాణం చేసేందుకు నగరవాసులు ఎంతో ఆసక్తి చూపుతున్న పరిస్థితులు ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో చేపడుతున్న 5 మెట్రో మార్గాలతో పాటు ఐటీ కారిడార్, హైదరాబాద్ వెస్ట్ జోన్ ప్రాంతాల మీదుగా ఆ రెండు మార్గాలను చేపట్టాల్సిన అవసరం ఉన్నది. ఇప్పుడు మొదలు పెడితేనే మరో 4-5 ఏండ్లలో ఆ మార్గాలు అందుబాటులోకి వస్తాయి. అప్పటి వరకు మరింత ట్రాఫిక్ పెరిగినా.. మెట్రో అందుబాటులో వస్తే భవిష్యత్ ట్రాఫిక్ కష్టాలకు ఫుల్‌స్టాప్ పడినట్టేనని రవాణా రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా మెట్రో అధికారులు ప్రభుత్వాన్ని ఒప్పించి .. పక్కన పెట్టేసిన ఆ రెండు మెట్రో మార్గాలను సైతం వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదంటున్నారు.

రోజూ 60-70 వేల కార్ల రాకపోకలు

గచ్చిబౌలి నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా శంషాబాద్ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వరకు ఉన్న 24 కి.మీ మార్గంలో ప్రతి రోజూ 60-70 వేల కార్లు రాకపోకలు సాగిస్తుంటే... అందులో సగానికి పైగా కేవలం శంషాబాద్ విమానాశ్రయం నుంచే ఉంటున్నాయి. అంటే హైదరాబాద్ వెస్ట్, నార్త్ దిక్కుల నుంచే వేలాది కార్లు ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నాయి. అదే సమయంలో ఓఆర్ఆర్ మీదుగా తూర్పు, దక్షిణ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి వచ్చే కార్లు 1-2 వేలకు మించి లేవు. ఈ గణాంకాలన్నీ ఓఆర్ఆర్ మీద ఉన్న టోల్ వసూలు చేస్తున్న కేంద్రాల నుంచి స్పష్టంగా తెలుస్తుంది. నగరంలోని ఏ దిక్కు నుంచి ఎక్కువ ట్రాఫిక్ ఎయిర్‌పోర్టులోకి వస్తున్నది.. అన్న విషయాన్ని ఓఆర్ఆర్ మీద రాకపోకలు సాగించే కార్లే చెబుతున్నాయి. ఇలా ఎంతో స్పష్టమైన ఆధారాలకు తోడు కోట్ల రూపాయలు వెచ్చించి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రూపొందించిన ట్రాఫిక్ అధ్యయనాలు, ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలను బుట్ట దాఖలు చేయడంపై పట్టణ రవాణా రంగ నిపుణులు మండిపడుతున్నారు.

మూసీ కోసం నిధుల వేట

ప్రపంచ బ్యాంక్ సాయం పొందేలా సంప్రదింపులు • అయినా దక్కని ప్రోత్సాహకాలు

సిటీబ్యూరో, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ) : లక్షన్నర కోట్ల ప్రాజెక్టు... 1500 కోట్లు కేటాయింపు. దశల వారీగా పెరిగిన లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ థేమ్స్ తరహాలో మూసీని తీర్చిదిద్దుతామంటూ చెప్పుకున్న ప్రభుత్వం.. ఇప్పుడు నిధుల కోసం తండ్లాడుతోంది. చేతి నిండా డబ్బులు లేకున్నా... బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి.. ప్రయోజనాలు లేని మూసీలో కుమ్మరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మూడు నెలల్లో వ్యవధిలో లక్ష కోట్లకు అంచనా వ్యయం పెంచడంపై ఆర్థిక, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, కనీసం తాగునీటి అవసరాలనూ తీర్చలేని మూసీ పేరిట అప్పులు తెచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ చుట్టూ కాంగ్రెస్ ప్రభుత్వం చక్కర్లు కొడుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. 55 కిలోమీటర్లు మేర విస్తరించిన మూసీ నది సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర కోట్లు ఖర్చు చేసేందుకు ఉన్న అవకాశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటోంది. భారీ అంచనా వ్యయానికి తగినట్లు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి... మూసీ పేరిట అప్పులు తెచ్చే పనిలో పడింది. దశల వారీగా మూసీని డెవలప్ చేస్తామంటూనే ప్రాజెక్టు కోసం భారీగా ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ క్రమంలో ప్రపంచ బ్యాంక్ నుంచి రూ. 5వేల కోట్ల నిధులను కోరుతోంది. పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం... ప్రపంచ బ్యాంక్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడింది.

కేటాయింపులు లేవు..

లక్షన్నర కోట్లతో మురుగునీరు ప్రవహించే మూసీని మెరిపిస్తామని చెప్పిన ప్రభుత్వం... తాజాగా బడ్జెట్‌లో అత్తెసరు నిధులతో సరిపెట్టింది. కేవలం రూ. 1500 కోట్లను కేటాయించి వాటితోనే బృహత్తరమైన ప్రణాళికలను రూపొందించేందుకు ఖర్చు చేస్తామని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ నగరంలో పెట్టుబడులకు ఐనానిక్‌గా మూసీని తీర్చిదిద్దుతామని చెబుతూనే ప్రాజెక్టును అప్పులు చేసి మొదలుపెట్టనున్నది. తక్కువ ఖర్చులో ప్రాజెక్టును చేపట్టేలా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు గతంలోనే దాదాపు రూ.16వేల కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను కూడా కాంగ్రెస్ సర్కారు పక్కనపెట్టేసింది. కనీసం బడ్జెట్‌లోనైనా భారీ మొత్తంలో కేటాయింపులు చేయకుండా అప్పులతోనే ప్రాజెక్టును చేపట్టేలా రేవంత్ సర్కారు యోచిస్తోంది. కానీ ప్రభుత్వం చేయి చాచినంత వేగంగా అక్కడి నుంచి స్పందన లేదని, వరల్డ్ బ్యాంక్ ప్రాధాన్యతలు వేరే అంశాలపై ఉన్నాయని తెలుస్తోంది.

చంద్రబాబు తరహాలో..

మూసీ నది పేరిట భారీ మొత్తంలో ప్రపంచ బ్యాంక్ నుంచి నిధుల సమీకరణపై ఆర్థిక నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఆర్థిక సాయం పేరిట నిబంధనలను పాటించాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. అయితే మూసీ కోసం వరల్డ్ బ్యాంక్‌ను ఆశ్రయించడం వెనుక వేరే ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరిట భారీ మొత్తంలో నిధుల సమీకరించుకునే క్రమంలో... ముందుగా మూసీ సుందరీకరణతో వరల్డ్ బ్యాంక్ వైపు అడుగులు వేసి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. పదేండ్లలో ఏనాడూ వరల్డ్ బ్యాంక్ సాయం అందిన దాఖాలాలు లేని సందర్భంలో ఏపీ సీఎం చంద్రబాబు తరహాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అసలు మూసీ పేరిట ఇంతగా కసరత్తు చేయాల్సిన అవసరమే లేదని, ముందుగా తక్కువ వ్యయంతో మూసీని పరిరక్షించుకునేలా ప్రణాళికలపై దృష్టి పెట్టాలని సామాజిక, ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు.

ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

యువతకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు పిలుపు

సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): 'ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మిద్దాం'..అంటూ యువతకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు పిలుపునిచ్చారు . ఈ మేరకు ఆయన యువతకు వీడియో సందేశాలను పంపిస్తున్నారు. అందులోని సారాంశం ఇలా ఉంది...'తల్లిదండ్రులు ఫోన్ కొనివ్వలేదని, పరీక్షలో ఫెయిల్ అయ్యారని, తక్కువ మార్కులు వచ్చాయని, లవ్ ఫెయిల్ అయ్యిందని ఇలా చిన్న చిన్న కారణాలు.. డిప్రెషన్.. ఆవేశపూరిత మనస్తత్వాలు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి.. ఓ యువత ఆగండి.. ఆలోచించండి... జీవితంలో పరీక్షలు మళ్లీ వస్తాయి.. కానీ నీవు లేకపోతే నీ తల్లిదండ్రులకు నీలాగా ఇంకెవ్వరు రారు. నీవు అనుకుంటున్న సమస్యలు 90 శాతం నీ ఊహ మాత్రమే... నీవు ఏదో సాధించడానికే భూమి మీదకు వచ్చావు. నీవెంటో నిరూపించుకునే సత్తా నీలో ఉంది.. నీ గెలుపును ఆపగలిగేవాడు ఎవడూ లేడు.. ఈ దేశానికి మీరే వెన్నముక... రండి ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మిద్దాం' అంటూ సీపీ సందేశాన్ని పంపిస్తున్నారు.

'ఇన్నోవేషన్ గాలా - 2024' అవార్డులు

సిటీబ్యూరో: కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంతో వినూత్న ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించేందుకు హైసీయా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్‌తో కలిసి టీ హబ్ కేంద్రంగా ఇన్నోవేషన్ గాలా-2024 అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఏఐతో కొత్త ఆవిష్కరణలు చేసే వారి నుంచి మ్యాథ్ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మరిన్ని వివరాలకు ఈ కింది లింకు(https://mathub.ai/innovation-gala-2024/)లో సంప్రదించాలని, ఆగస్టు 20లోగా దరఖాస్తులను పంపించాలని సూచిస్తోంది.

నేటి నుంచి ఉద్యోగుల అంతర్గత బదిలీలు

కమిషనర్‌కు చేరిన కమిటీ నివేదిక

సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర స్థాయి బదిలీల ప్రక్రియ ముగియడంతో అన్ని శాఖల్లో వరుసగా మూడేండ్లకు పైబడి తిష్ట వేసిన ఉద్యోగులు, అవినీతి ఆరోపణలు ఉన్న వారికి స్థానచలనం కల్పించాలని కమిషనర్ ఆమ్రపాలి నిర్ణయించారు. ఈ మేరకు బదిలీలు అత్యంత పారదర్శకంగా జరిపే ఉద్దేశంతో నలుగురు అదనపు కమిషనర్లతో కూడిన కమిటీని వేశారు. ఈ కమిటీ కమిషనర్‌కు నివేదిక సమర్పించగా, నేడు, రేపు బదిలీల ప్రక్రియను ముగించేలా కసరత్తును పూర్తి చేశారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, హెల్త్, ఆర్థిక శాఖలో భారీగా బదిలీలు ఉండనున్నాయి.

గాడి తప్పిన స్వచ్ఛత

ఎక్కడపడితే అక్కడే.. నిర్మాణ వ్యర్థాలు

సిటీబ్యూరో: గ్రేటర్‌లో భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియ గాడితప్పింది. ఎక్కడ పడితే అక్కడే నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నిర్మాణ వ్యర్థాల సేకరణకు టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చారు. జీడిమెట్ల, ఫతుల్లాగూడ, మల్కాజిగిరి, శంషాబాద్, తూంకుంటల్లో సీ అండ్ డీ రీసైక్లింగ్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా భవన నిర్మాణ, కూల్చివేసిన వ్యర్థాలను రోడ్డు, పుట్‌పాత్, నాలాలు, చెరువులు, అనుమతి లేని ప్రదేశాల్లో పడేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్ డీ ప్లాంట్లకు తరలించాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అనుమతి లేని ప్రదేశాల్లో పారబోస్తే.. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించినా.. ఫలితం లేకుండా పోతున్నది. జోనల్ పరిధిలో సర్కిళ్ల వారీగా నిర్మాణ వ్యర్థాల కలెక్షన్ పాయింట్లు, మినీ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా తరలించే వ్యవస్థ కనబడటం లేదు. ఫలితంగా భవన నిర్మాణ వ్యర్థాలతో గ్రేటర్‌లోని ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులకు నిలయాలుగా మారుతున్నాయి. 'స్వచ్ఛ హైదరాబాద్' లక్ష్యం నీరుగారుతున్నది.

బంజారాహిల్స్ రోడ్ నంబర్.12లోని ఏసీబీ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్

వారసిగూడలోని రహదారి వెంట వ్యర్థాలు ఇలా పడేయడంతో అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. నగరాన్ని స్వచ్ఛతగా మారుద్దామంటూ..పిలుపునిచ్చే బల్దియా నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నారు

చెత్త ఎత్తేవారేరీ..?

డంపింగ్ యార్డులా ప్రధాన రహదారులు

వ్యర్థాల సేకరణకు టోల్ ఫ్రీ నంబర్లు.. అయినా స్పందన కరువు

టోల్‌ఫ్రీ నంబర్లు ఇచ్చినా..

సజావుగా సాగట్లే

మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిల్‌తో పాటు, చార్మినార్ జోన్‌లోని చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, రాజేంద్రనగర్ సర్కిల్, కూకట్‌పల్లి, అల్వాల్, సికింద్రాబాద్ జోన్‌లో మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ పరిధిలో నిర్మాణ వ్యర్థాలు సేకరణకు తూంకుంట, శంషాబాద్ ప్లాంట్ సంబంధించి వాట్సాప్ నంబర్ 73300 00203, లేదా టోల్ ఫ్రీ 1800-203-0033కు ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి వ్యర్థాలను తీసుకొని వెళ్తారని కమిషనర్ తెలిపారు. మూసాపేట్, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్ యూసుఫ్‌గూడ, చందానగర్ శేరిలింగంపల్లి, ఆర్ సీపురం సర్కిళ్లకు, సికింద్రాబాద్ జోన్ అంబర్‌పేట, ఎల్బీనగర్ జోన్‌లో ఉప్పల్, హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, చార్మినార్ జోన్‌లో మలక్‌పేట, సంతోష్‌నగర్ సర్కిళ్లలో ఫతుల్లగూడ, జీడిమెట్ల ప్లాంట్లకు సంబంధించిన వాట్సాప్ నంబర్ 9100 927 073కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800- 120 - 1159కు కాల్ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇందుకు టన్నుకు జీహెచ్ఎంసీ నిర్ణయించిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు సజావుగా సాగడం లేదు.